
సాక్షి తూర్పుగోదావరి

బుధవారం 29 మార్చి 2023



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం గోదావరి తూర్పు డెల్టా కాలువకు 1,960, మధ్య డెల్టాకు 1,275, పశ్చిమ డెల్టాకు 3,400 క్యూసెక్కుల నీరు వదిలారు.



ఒకటి నుంచి కల్యాణోత్సవాలు


కడియం: స్థానిక కెనాల్ రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాలు ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకూ జరుగుతాయి.

అందాల స్వామికి.. కల్యాణ వేడుక



శ్రీ జగన్మోహినీ కేశవస్వామి వారి కల్యాణోత్సవాలకు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలి గ్రామం ముస్తాబవుతోంది. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు.

8లో



న్యూస్‌రీల్

భూసేకరణ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): భూసేకరణకు సంబంధించిన సమస్యలను జూన్ 30వ తేదీ నాటికి పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ తేజ్ భరత్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఏడీబీ రోడ్డు కోసం చేపట్టిన భూసేకరణకు సంబంధించి అంశాలను త్వరితగతిన పరిష్కారం చేయాలన్నారు. రాజానగరం మండలం పరిధిలో ఏడీబీ రహదారి విస్తరణ పనుల కోసం భూసేకరణకు చెందిన 19 సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. పరిహారం కోసం ఒకరు కోర్టుకు వెళ్లారన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ వివరాలు తెలుసుకునేందుకు రెవెన్యూ, సర్వే, ఆర్‌అండ్‌బీ, ప్రాజెక్ట్ మేనేజర్‌లతో కూడిన బృందాన్ని పంపించి నివేదిక అందజేస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి, జాతీయ రహదారుల పీడీ సురేంద్ర, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ ఎండీ ఆలీ పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణం



నిర్మాణంలో ఉన్న బాస్కెట్ బాల్ కోర్టు

దేవరపల్లి: దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద స్థానిక పరమేశు బయోటెక్ కెమికల్ పరిశ్రమ యాజమాన్యం సుమారు రూ.10 లక్షల వ్యయంతో బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణం చేపట్టింది. దాదాపు 13 సెంట్ల విస్తీర్ణంలో సిమెంట్ కోర్టు ఏర్పాటు చేస్తున్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ కోర్టు నిర్మిస్తున్నట్టు పరిశ్రమ యాజమాన్యం తెలిపింది. పనులు వేగంగా జరుగుతున్నాయని పీడీ ఓరుగంటి నాగరాజు వివరించారు.

ఆర్టీసీలో సౌకర్యాల కల్పనకు కృషి



రాజమహేంద్రవరం బస్టాండ్‌లో పర్యటిస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యానికి, ఉద్యోగుల సంక్షేమానికి నిరంతర కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో పలు విభాగాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అలాగే అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైన రూట్లలో బస్సులు నడపాలని సూచించారు. అనంతరం జిల్లాలోని నాలుగు డిపోల అధికారులతో సమావేశం నిర్వహించి, ఆదాయ వనరులను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. డిపో అధికారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటి పరిష్కారానికి సూచనలు చేశారు. 2023 -24 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం పెంచాలన్నారు. రాజమహేంద్రవరం బస్టాండ్‌లో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మహిళల విశ్రాంతి గదులను, సరకు రవాణా భవనంలో అదనంగా నిర్మించిన గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి కే.షర్మిల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలు..!

- రూ.10.79 కోట్లతో జూనియర్ కళాశాలల ఆధునికీకరణ
- జిల్లా వ్యాప్తంగా 15 కాలేజీలకు అవకాశం
- 'నాడు–నేడు' ద్వారా అభివృద్ధికి ప్రణాళికలు
- త్వరితగతిన పనుల పూర్తికి చర్యలు
- నిధుల వినియోగానికి కమిటీల నియామకం



గోకవరం జూనియర్ కళాశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులు

సాక్షి, రాజమహేంద్రవరం: విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంస్కరణలకు నాంది పలికింది. పేద విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ అభ్యసించేందుకు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో ప్రోత్సాహం అందిస్తోంది. ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునేలా నాడు–నేడు పథకంలో పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగానే జూనియర్ కళాశాలల ఆధునికీకరణ, వసతుల కల్పనపై దృష్టి సారించింది. నాడు–నేడు పరిధిలోకి తీసుకువచ్చి బాగుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందుకు అవసరమైన నిధులు కేటాయించింది. రూ.10.79 కోట్ల అంచనా వ్యయంతో 15 కళాశాలల ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. ఇప్పటికే ప్రారంభమైన పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. వెరసి కొన్నేళ్లుగా నిధుల లేమితో కునారిల్లుతున్న కళాశాలలు.. ప్రస్తుతం నిధులతో కళకళలాడుతున్నాయి.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

ఇంటర్ కళాశాలలపై గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. విద్యా విధానంలో 1968–1972 మధ్య జూనియర్ కళాశాలలు ఏర్పాటయ్యాయి. ప్రారంభ సమయంలో కళాశాల భవనాల్లో చిన్నపాటి మరమ్మతులకు నిధులు విడుదల చేశారు. అనంతరం వాటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అప్పటి ఇప్పటివరకు పెద్ద సంఖ్యలో ఆధునికీకరణ పనులు జరిగిన సందర్భాలు లేదు. వెరసి కళాశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. భవనాలు శిథిలావస్థకు చేరడం, వసతులు, భవనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందుల మధ్య విద్య కొనసాగించేవారు.

రూపురేఖలు మారేలా..

- ఇంటర్ కళాశాలల్లో విద్యార్థుల కష్టాలు దూరం చేసి ఆహ్లాదకర వాతావరణంలో చదుకునేలా చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.
- ఇందులో భాగంగానే నాడు–నేడు కింద భారీ స్థాయిలో నిధులు కేటాయించింది. జూనియర్ కళాశాలల చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం ఇదే తొలి సారి.
- కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అత్యవసరమైన నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు నిర్మించనున్నారు.
- సింహభాగం కళాశాల భవనాలకు పైకప్పు పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితి. పెచ్చులూడుతున్న ఫ్లోర్‌ను తొలగించి కొత్తగా తీర్చిదిద్దనున్నారు.
- తాగునీటి ఇబ్బందులు పడకుండా రక్షిత నీరు అందించాలన్న ఉద్దేశంతో ఆర్వో ప్లాంట్లు అందుబాటులో ఉంచుతున్నారు.
- విద్యార్థులు, అధ్యాపకులకు అవసరమైన ఫర్నిచర్ సమకూరుస్తున్నారు.
- అధిక శాతం కాలేజీలకు విద్యుత్ సదుపాయం లేదు. వాటికి పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు.
- అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా కళాశాలల చుట్టూ ప్రహరీల నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు.
- క్లాస్ రూమ్‌లలో లైట్లు, ఫ్యాన్లు అమర్చుతున్నారు. భవనాలకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.
- ఆధునిక హంగులతో కళాశాలల రూపురేఖలు మారనున్నాయి.

పారదర్శకతకు పెద్దపీట

అభివృద్ధి పనుల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. పనుల పర్యవేక్షణ, నిధుల వినియోగంలో రాజకీయాలకు తావులేకుండా చేసింది. కళాశాల స్థాయిలో పార్టీలు, వర్గాలకు అతీతంగా ఎనిమిది మందితో కూడిన ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసింది. కాలేజీ ప్రిన్సిపల్ కన్వీనర్‌గా ఉండే కమిటీలో ఇంజినీరింగ్ అధికారి, ఇద్దరు లెక్చరర్లు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముగ్గురు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సభ్యులుగా ఉంటారు. పనుల నాణ్యతపై సభ్యులు సంతృప్తి చెందాకే బ్యాంకుల నుంచి నిధులు డ్రా చేసుకునే వీలుంటుంది.

కళాశాలల వారీగా నిధుల వెచ్చింపు ఇలా..

కళాశాల	వ్యయం అంచనా(రూ.ల్లో)
రాజమహేంద్రవరం	1,47,05,513
కొవ్వూరు(బాలుర)	89,66,718
కొవ్వూరు(బాలికలు)	30,62,595
నిడదవోలు(బాలుర)	1,09,29,600
నిడదవోలు(బాలికల)	78,39,396
చాగల్లు	92,17,177
గోపాలపురం	8,94,781
వేగేశ్వరపురం	38,87,722
ధవళేశ్వరం	79,14,731
మురమండ	68,82,679
యర్నగూడెం	18,45,397
కోరుకొండ	62,02,693
గోకవరం	1,23,56,270
సీతానగరం	67,15,412
రంగంపేట	65,36,884



నాణ్యతకు ప్రాధాన్యం



కళాశాల అభివృద్ధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాల్సి ఉన్నా.. ఇంటర్ పరీక్షల కారణంగా కాస్త ఆలస్యమైంది. జిల్లాలోని అన్ని కళాశాలల్లో పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. త్వరలోనే పూర్తి స్థాయి లక్ష్యాలను అధిగమిస్తాం. ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో ప్రతి రూపాయినీ కాలేజీ ఆధునీకరణకే వెచ్చిస్తున్నాం. పనుల్లో పారదర్శకత కోసం కళాశాల ప్రిన్సిపాళ్లతో కమిటీ వేసి పర్యవేక్షణ చేపడుతున్నాం.

– ఐ.శారద, రీజినల్ జాయింట్ డైరెక్టర్, ఇంటర్ బోర్డు

వ్యాధుల నివారణకు ప్రణాళిక



సమావేశంలో పాల్గొన్న రామనాథరావు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: సీజనల్‌గా వచ్చే మలేరియా, డెంగీ నివారణకు ముందస్తు ప్రణాళిక అవసరమని మలేరియా డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు అధికారులకు పిలుపునిచ్చారు. పూర్వపు తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలకు చెందిన డీఎంఓ, ఏఎంఓ తదితర అధికారులతో జోనల్ మలేరియా అధికారి సుబ్రహ్మణ్యేశ్వరి నేతృత్వంలో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. కార్యక్రమంలో జోనల్ అడిషనల్ డైరెక్టర్ బీఎల్ఎస్ కుమార్ పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీకి నిర్ధారణ పరీక్షలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్) స్థానిక ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా సమగ్రశిక్ష,సహిత విద్యాశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీకి నిర్ధారణ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుబ్బారావు కోరారు. స్కూల్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు చేసి ఉపకరణాల వివరములను తెలియజేశారన్నారు. సహిత విద్య కోఆర్డినేటర్ జి స్నేహలత మాట్లాడుతూ పది మండలాల నుంచి 66 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారన్నారు.

రత్నగిరీశునికి కానుకల వర్షం.!



సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

- హుండీల ద్వారా రూ.3.31 కోట్ల ఆదాయం
- ఒకేసారి ఇంత మొత్తం ఆదాయం ఒక రికార్డు

అన్నవరం: సత్యదేవునికి హుండీల ద్వారా దండిగా ఆదాయం సమకూరింది. గత రెండు నెలల్లో పెళ్లిళ్ల సీజన్ కారణంగా ఆలయానికి నవదంపతులు, వారి బంధుమిత్రులు, ఇతర భక్తులు భారీగా తరలివచ్చి పెద్ద మొత్తంలో స్వామివారి హుండీలలో కానుకలు సమర్పించారు. ఫలితంగా రూ.3,31,57,122 ఆదాయం సమకూరింది. మంగళవారం హుండీలను తెరచి లెక్కించారు. గత జనవరి 27వ తేదీన లెక్కించారు. గడచిన 60 రోజులకు సంబంధించి నిత్య కల్యాణ మండపంలో తాజాగా హుండీ లెక్కింపు నిర్వహించారు. సుమారు 600 మంది సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీ నగదు కూడా..

హుండీలో నగదు రూ.3,18,20,080 కాగా, చిల్లర నాణాలు 13,37,042. వీటితోపాటు 145 గ్రాముల బంగారం, 800 గ్రాముల వెండి లభించినట్టు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. సింగపూర్ డాలర్లు 74, అమెరికా డాలర్లు 2,465, ఆస్ట్రేలియా డాలర్లు 980, సౌదీ అరేబియా రియల్స్ నాలుగు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ పౌండ్లు పది, కెనడా డాలర్లు 20, యుఏఈ దీరామ్స్24, ఇండోనేషియా రూపాయలు పదివేలు, ఖతార్ కరెన్సీ 556, కువైట్ దీనార్లు 55, వియత్నాం డంగ్స్ 30 వేలు, 20 యూరోలు లభించాయని పేర్కొన్నారు. లెక్కింపు ప్రక్రియను దేవస్థానం ఛైర్మన్ ఐవీ రోహిత్, ధర్మకర్తల మండలి సభ్యులు పేరూరి బద్రీ నారాయణ, విజయలక్ష్మి, దేవదాయశాఖ అధికారులు పి.నారాయణ మూర్తి, ఎంఎం వీరభద్రరావు, దేవస్థానం సిబ్బంది పర్యవేక్షించారు.

ఒక్కరోజులోనే లెక్కింపు

దేవస్థానంలో గతంలో రూ.2 కోట్లు దాటి ఆదాయం వచ్చిన సందర్భంలో రెండు రోజులు హుండీ ఆదాయం లెక్కించేవారు. ఈ సారి రూ.3.31 కోట్లు హుండీ ఆదాయాన్ని ఒక్క రోజులోనే లెక్కించడం విశేషం. గతంలో ఈ కార్యక్రమానికి చాలా మంది సిబ్బంది గైర్హాజరయ్యేవారు. దేవస్థానం సిబ్బంది కన్నా స్వచ్ఛంద సేవా సంస్థల సిబ్బంది ఎక్కువ కనిపించేవారు. ఈ సారి ఒక్కరు కూడా గైర్హాజరు కాకపోవడం గమనార్హం. ఉదయం 8 గంటల నుంచి సాయింత్రం 5 గంటల వరకు లెక్కింపు జరిగింది. హుండీ లెక్కింపు ప్రక్రియ వీడియోలో రికార్డు చేశారు. దీంతో హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది కదలికలు కూడా ఇందులో రికార్డయ్యాయి.

రాష్ట్రంలో సంపూర్ణ సంక్షేమ పాలన





డ్వాక్రా మహిళలకు రూ.15.33 కోట్ల నమూనా చెక్కు అందిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, హాజరైన డ్వాక్రా మహిళలు

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేత
- పాల్గొన్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: ముఖ్యమంత్రి జగనన్న సారథ్యంలో రాష్ట్రంలో సంపూర్ణ సంక్షేమ పాలన నడుస్తోందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యుడు మార్గాని భరత్‌రామ్ అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత రుణమాఫీ నమూనా చెక్కు పంపిణీ కార్యక్రమం మంగళవారం దేవరపల్లిలోని ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగింది. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంపీ భరత్ రామ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని 80 లక్షల మంది స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.25 వేల కోట్ల రుణమాఫీని నాలుగు విడతల్లో జగనన్న చెల్లిస్తున్నారన్నారు. ఇప్పటికే మూడు విడతల నిధులను విడుదల చేశారన్నారు.

నియోజకవర్గంలో రూ.227 కోట్ల రుణమాఫీ

గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని ఆరు వేల డ్వాక్రా గ్రూపుల మహిళలకు నాలుగు విడతల్లో రూ.227 కోట్ల రుణమాఫీ జరుగుతుందన్నారు. మూడు విడతల్లో ఇప్పటి వరకూ రూ.190 కోట్లను వారి ఖాతాలకు విడుదల చేశారన్నారు. నియోజకవర్గంలో 20 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు అందజేశామని చెప్పారు. దేవరపల్లి మండలంలో మూడో విడత 1661 స్వయం సహాయక సంఘాలకు రూ.15.33 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అనంతరం వేదికపై డ్వాక్రా మహిళలకు రూ.15.33 కోట్ల నమూనా చెక్కును ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే వెంకట్రావు అందజేశారు. సీఎం జగనన్న సందేశాన్ని ఎంపీ భరత్‌రామ్ చదివి వినిపించారు. సుమారు ఐదు వేల మంది మహిళలతో సభా ప్రాంగణం కిటకిటలాడింది. తొలుత వైఎస్సార్ విగ్రహానికి ఎంపీ, ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు గారపాటి రమాప్రభ, మండల మహిళా అధ్యక్షురాలు కదలి హైమావతి పాల్గొన్నారు.

ఆస్పత్రుల తీరుపై కలెక్టర్ సీరియస్

- ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల నుంచి అపరాధ రుసుం వసూలుకు ఆదేశాలు
- నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తే కఠిన చర్యలు
- 'సాక్షి' కథనంపై కదిలిన యంత్రాంగం





ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల క్రమశిక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రోగులకు నగదు రహిత సేవలందించాలని, నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తే సహించే ప్రసక్తే లేదని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో ఆమె సమావేశం నిర్వహించారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం అమలు విషయంలో కొన్ని ఆస్పత్రులు పరీక్షల పేరిట రోగులను పీడిస్తున్నాయి. ఇటీవల ఈ వ్యవహారంపై 'సాక్షి'లో కథనం వెలువడింది. ఈనేపథ్యంలో కలెక్టర్ ఆరోగ్యశ్రీ పథకం అమలుపై జిల్లా స్థాయి క్రమశిక్షణ కమిటీతో భేటీ అయ్యారు. అనధికార రుసుము వసూలు చేసిన 11 ఆసుపత్రుల నుంచి రూ.14.22 లక్షల మేర అపరాధ రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సేవలు అందించే క్రమంలో రోగుల నుంచి అనధికార వసూళ్లు, సేవాలోపం తదితర వాటిపై ఐవీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదులు అందాయన్నారు.



ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులు నిర్లక్ష్య వైఖరి వహిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. నగదు వసూలు చేయడం, వైద్య సేవల్లో లోపాలు, స్కానింగ్ ఫీజు వసూలు, రోగిని చేర్చుకోవడానికి తిరస్కరించడం వంటి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫిర్యాదులు పునరావృతమైతే ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నా తమను వివిధ రకాల వసూళ్లతో ఇబ్బంది పెడుతున్నాయంటూ ఆస్పత్రులపై 70 ఫిర్యాదులు వచ్చాయన్నారు. సచివాలయాల ద్వారా 42, ఐవీఆర్ఎస్ ద్వారా 28 వచ్చాయన్నారు. ఫిర్యాదులలో ఎక్కువ శాతం మెడికల్ టెస్టులకు సంబంధించినవే. ఒక్క రూపాయి కూడా వసూలు చెయ్యకుండా వైద్య సేవలు అందించేలా ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. సమావేశం సమన్వయ కర్తగా ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎమ్.సనత్ కుమారి, నెట్ వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం, ప్రతినిధులు హాజరయ్యారు.

క్లుప్తంగా

జగన్‌ను మరోసారి సీఎంగా చేసుకుందాం

జనసేన సర్పంచ్ కాకర శ్రీనివాస్



సభలో మాట్లాడుతున్న జనసేన సర్పంచ్ కాకర శ్రీనివాస్

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకుందామని జనసేన పార్టీకి చెందిన రామరాజులంక గ్రామ సర్పంచ్ కాకర శ్రీనివాస్ అన్నారు. కత్తిమండలోని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ ప్రసంగిస్తూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు పేదరికం రూపు మాపే విధంగా, పేద కుటుంబాలకు ఎంతో అండగా, ఆసరాగా ఉంటున్నాయని అన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి దేశంలోనే ఎక్కడా లేరని కొనియాడారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు దేశంలో ఎక్కడా లేదని అన్నారు. కుల మత రాజకీయాలకు అతీతంగా ప్రజారంజక పాలన అందిస్తున్న జగన్ లాంటి ముఖ్యమంత్రిని అందరం కాపాడుకోవాలని, మళ్లీ ముఖ్యమంత్రిగా కొనసాగేలా కృషి చేద్దామని అన్నారు.

మోసం చేసిన 11 మందిపై కేసు

అయినవిల్లి: ఇటుకబట్టీలో పనిచేస్తామని బట్టీ యజమాని వద్ద రూ.4.70 లక్షలు అడ్వాన్సు తీసుకుని మోసగించిన 11 మందిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. నాగేశ్వరరావు తెలిపారు. అయినవిల్లి మండలం అయినవిల్లిలంక గ్రామానికి చెందిన ముళ్లపూడి జనార్దనరావు వద్ద పిఠాపురానికి చెందిన కుమ్మరి రాంబాబు మరో పది మంది తన ఇటుక బట్టీలో పనిచేస్తామని చెప్పి రూ.4.70 లక్షలు తీసుకుని మోసగించారని ఫిర్యాదు చేశాడు. దీని పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అందాల స్వామికి.. కల్యాణ వేడుక

- రేపు జగన్మోహినీ కేశవస్వామి వారి పరిణయం
- వచ్చే నెల 6వ తేదీ వరకూ ఉత్సవాలు
- ముస్తాబైన ర్యాలి పుణ్యక్షేత్రం

ఆత్రేయపురం: జగత్తులోని సౌందర్యాన్నంతటినీ పోత పోసినట్టు.. మిసమిసలాడుతూ దర్శనమిచ్చే నునుపైన సాలగ్రామ శిలావిగ్రహం.. ముందు పురుషాకృతి.. వెనుక భాగాన స్త్రీ రూపం.. ఇటువంటి ఏకశిలా మూర్తిగా.. స్వయంభువుగా వెలసిన వేలుపు జగన్మోహినీ కేశవస్వామి. ఈ స్వామిని దర్శిస్తే సమస్త పాపాలూ హరిస్తాయని భక్తుల విశ్వాసం. ఈ అందాల స్వామి కల్యాణ వేడుకకు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలి గ్రామం ముస్తాబవుతోంది. ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 6 వరకూ స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

అడుగడుగునా అద్భుతాలే..

- ఇక్కడ స్వామివారి సౌందర్యాన్ని వర్ణించనలవి కాదు. స్వయంగా చూసి తీరవలసిందే అన్నట్టుగా ఉంటుంది.
- ఈ ఆలయంలో జగన్మోహినీ కేశవస్వామి ఐదడుగుల సాలగ్రామ ఏకశిలా మూర్తిగా దర్శనమిస్తారు. ముందు కేశవస్వామి, వెనుక భాగంలో జగన్మోహినిగా స్త్రీ రూపంలో అవతరించారు. స్త్రీమూర్తి కొప్పున శిఖ చుట్టుకున్నట్టు.. అందులో చామంతి పుష్పం.. అప్పుడే సంపంగి నూనె రాసినట్టు అందంగా, ఒద్దికగా తీర్చిదిద్దిన కురులు.. దండకడియాలు.. కచ్చా పోసిన రీతిలో చీరకట్టు.. పద్మినీ జాతి స్త్రీలకు శుభసూచకమని భావించేలా కుడికాలి తొడపై తెల్లగా, పొడవుగా పుట్టుమచ్చ.. కాళ్లకు అందెలు, గజ్జెలు దర్శనమిస్తాయి.
- ఈ శిలా విగ్రహంలో కిరీటం; మకర కుండలాలు; కర్ణపత్రాలు; కంఠంపై త్రివళులు (ముడుతలు); కౌస్తుభ మణిహారాలు; జపమాల; యజ్ఞోపవీతం; స్ఫుటంగా సొగసైన నాభిస్థానం; ఉత్తరీయం; శంఖం, చక్రం, గద పట్టుకున్న హస్తాలు; చేతివేళ్లకు ఉంగరాలు; అందంగా కొనదేలిన గోళ్లు; అభయ హస్తం, దానిపై రేఖలు సైతం ఎంతో అద్భుతంగా దర్శనమిస్తాయి.
- ఇంకా స్వామి వారి దేవేరులు శ్రీదేవి, భూదేవి.. స్వామి పాదాల చెంతనే సేవ చేసుకుంటున్న గరుత్మంతుడిని ఇక్కడ దర్శించవచ్చు. స్వామి వారి రెండు పాదాల మధ్యన పద్మాసనంలో గంగాదేవి కొలువుదీరింది. ఆమె తన పవిత్ర జలాలతో స్వామివారి రెండు పాదాలనూ నిరంతరం కడుగుతున్నట్టుగా దర్శనమిస్తుంది.
- స్వామి వారి ఉభయ పార్శ్వాల్లో పొన్నచెట్టు, గోవర్ధన గిరి ఎత్తిన శ్రీకృష్ణభగవానుడు, మకరతోరణం రీతి, దశావతారాలు, గానం చేస్తున్న తుంబుర నారదులు, స్వామివారికి పుష్పమాలలు వేస్తున్న కిన్నెర, కింపురుషాదులు, నృత్య భంగిమల్లో రంభ, ఊర్వశి అప్సరసలు, పడగ విప్పిన ఆదిశేషుడు దర్శనమిస్తారు.
- ఈ ఆలయ నిర్మాణం 11వ శతాబ్దంలో తూర్పు చాళుక్య రాజు రాజరాజనరేంద్రుని కాలంలో జరిగింది. ప్రపంచవ్యాప్తంగానే ఇటువంటి దేవాలయం లేదని చెబుతారు. ఈ స్వామి దర్శనం భక్తులను తన్మయత్వంలో ఓలలాడిస్తుంది.
- జగన్మోహినీ కేశవస్వామి ఆలయానికి ఎదురుగా పడమర వైపు శ్రీ ఉమా కమండలేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇది కూడా అద్భుత దేవాలయం. ఈశ్వరునిపై అభిషేకం చేసిన జలాలు పానపట్టంలోనే ఇంకిపోవడం ఇక్కడి ప్రత్యేకత. అందువలన ఈ ఆలయంలో అభిషేక జలాలు బయటకు వచ్చే సోమసూత్రంతో పాటు చండీశ్వరుని విగ్రహం కూడా ఉండవు.
- ఆలయంలో ఎత్తయిన పురాతన గాలిగోపురం, గర్భగుడి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల విగ్రహాలు భక్తులను తన్మయుల్ని చేస్తాయి.
- ఆలయ గర్భగుడి ప్రాంగణంలో అత్యంత లోతైన సొరంగ మార్గం ఉంది. ఇది పూర్వం ఉపయోగించేవారని అంటారు.



ర్యాలి గ్రామంలోని జగన్మోహినీ కేశవస్వామి వారి ఆలయం



స్వామి వారి ముందు (పురుష), వెనుక (స్త్రీ) రూపాలు



స్వామి వారి పాదాల చెంత ఉద్భవిస్తున్న గంగమ్మ

కల్యాణోత్సవాల క్రమమిదీ..

- ఈ నెల 30: ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం గరుడ వాహన సేవ, రాత్రి 8 గంటలకు కల్యాణోత్సవం.
- ఏప్రిల్ 3: పండిత సదస్యం
- 5: చక్రస్నానం
- 6: శ్రీపుష్పోత్సవం

క్షీరసాగర మథనానంతరం..

క్షీరసాగర మథన సమయంలో శ్రీ మహావిష్ణువు జగన్మోహినిగా అవతారంలో దేవదానవులకు అమృతం పంచి పెట్టి రథంపై వస్తున్నారట. గౌతమి – వశిష్ఠ గోదావరి పాయల మధ్య ప్రాంతంలోని రత్నాపురం గ్రామం వద్ద ఆయన రథం శీల (ఇరుసు) రాలి పడిందట. వెనుతిరిగి చూసేసరికి, అపూర్వ సౌందర్యరాశిగా ఉన్న తన జగన్మోహినీ అవతారం చూసి, మోహితుడైన పరమ శివుడు తనను వెంబడిస్తున్నట్టు గమనించారట. దీంతో ఆయనను ఆపేందుకు నిజ రూపంతో ముందు పురుష, వెనుక స్త్రీ రూపంలో జగన్మోహినీ కేశవస్వామిగా సాలగ్రామ శిలారూపంలో.. ఇక్కడ వెలిశారని స్థల పురాణం చెబుతుంది. అంతే కాదు.. జగన్మోహినీ అవతారం విష్ణుమాయ అని గ్రహించిన శివుడు సిగ్గుపడి.. కేశవస్వామికి ఎదురుగా ఉమా కమండలేశ్వరునిగా అవతరించారట. రథం శీల రాలి పడిన గ్రామం కనుక నాటి రత్నాపురం కాస్తా.. నేడు ర్యాలిగా పేరొందింది.

భస్మాసుర వధతో ముడి పడిన మరో కథ

భస్మాసురుడిని అంతమొందించే సమయంలో కూడా శ్రీమన్నారాయణుడు మోహినీ అవతారం ఎత్తారు. ఆమె సౌందర్యాన్ని చూడాలనే కుతూహలంతో పరమేశ్వరుడు ఆమెను వెంబడిస్తూ రత్నాపురం గ్రామానికి చేరాడని, ఇక్కడే శ్రీమహావిష్ణువు మోహినీ రూపాన్ని వీడి.. పరమ శివుని ఎదుట జగన్మోహినీ కేశవస్వామిగా సాక్షాత్కరించారని చెబుతారు. నిజం గ్రహించిన శివుడు ఇక్కడ ఉమా కమండలేశ్వరునిగా ఆవిర్భవించారని అంటారు.

భక్త విక్రమ దేవుని స్వప్నం

పూర్వం ఈ ప్రాంతం దట్టమైన అరణ్యంగా ఉండేది. విక్రమ దేవుడు అనే భక్తుడు ఈ ప్రాంతంలో వేట సాగిస్తూ ఒక చెట్టు వద్ద నిద్రించాడు. అతడికి శ్రీమహావిష్ణువు కలలో కనబడి, స్వయంభూ శిలా రూపంలో తాను ఆ ప్రాంతంలో ఉన్నానని, కర్రతో రథం చేయించి లాక్కొని వెళ్తే.. ఆ రథం శీల రాలి పడుతుందని, అక్కడ తవ్వితే తన విగ్రహం బయట పడుతుందని చెప్పి అదృశ్యమయ్యారని అంటారు. ఆ ప్రకారమే విక్రమ దేవుని ద్వారా ఈ విగ్రహం బయట పడిందని ఆలయ చరిత్ర చెబుతోంది.

ఏర్పాట్లు పూర్తి



శ్రీ జగన్మోహినీ కేశవస్వామి వారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. వీటికి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అందుకు తగినట్టుగా సౌకర్యాలు కల్పించాం.

– కృష్ణచైతన్య, కార్యనిర్వహణాధికారి, ర్యాలి దేవస్థానం




కల్యాణోత్సవానికి సిద్ధమైన కొబ్బరి బొండాలు

రాముని కల్యాణానికి బొండాలు, తలంబ్రాలు సిద్ధం



రామనామాలు రాసిన బియ్యపు గింజలు



రామ నామం రాసిన తలంబ్రాలు

పెదపూడి: జి.మామిడాడ శ్రీ కోదండ రామాలయంలో గురువారం జరిగే సీతా రాముల కల్యాణోత్సవానికి ప్రత్యేకంగా తయారు చేసిన కొబ్బరి బొండాలు, బియ్యపు గింజలపై మూడు భాషల్లో 'రామ' అని రాసిన తలంబ్రాలు సిద్ధమయ్యాయి. జి.మామిడాడకు చెందిన వ్యాయామోపాధ్యాయుడు, సూక్ష్మ కళాకారుడు ద్వారంపూడి యువరాజారెడ్డి, సంధ్య డెకరేషన్స్ అధినేత ద్వారంపూడి సంధ్య వీటిని తయారు చేశారు. కల్యాణ కొబ్బరి బొండాలపై రంగు రంగుల పొడులు, ముత్యాలు, లేసుల సహాయంతో శంఖు, చక్ర, నామాలు, రాముడు, సీత పేర్లను సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే లక్ష బియ్యపు గింజలపై ఎటువంటి సూక్ష్మ పరికరాలూ వినియోగించకుండా పెన్నుతో తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో 'రామ' నామం రాశారు. 14 ఏళ్ల నుంచి 6 లక్షలకు పైగా బియ్యపు గింజలపై మూడు భాషల్లో 'రామ' నామం రాశానని యువరాజారెడ్డి చెప్పారు.

సీతమ్మకు చేయిస్తి.. చిత్రాల సారెను..



కోవాతో చేసిన వివిధ రకాల స్వీట్లు

- భక్తులను ఆకట్టుకుంటున్న 'కోవా' కంత
- సీతారాముల కల్యాణం సందర్భంగా సీతమ్మవారికి సమర్పణ
- 20 రోజులుగా తయారీ



కోవాతో పర్ణశాలను చేస్తున్న మహిళా భక్తులు

పి.గన్నవరం: 'సీతమ్మకు చేయిస్తి.. చింతాకు పతకము..' అంటూ అలనాడు భక్త రామదాసు పాడుకున్నాడు. అదేవిధంగా సీతమ్మ వారికి చిత్రమైన సారెను సమర్పిస్తున్నారు ఆ భక్త దంపతులు. స్థానిక పాత అక్విడెక్టు వద్ద శ్రీ పట్టాభి రామాలయంలో ఈ నెల 30న జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు ఆలయ ధర్మకర్తలు పేరిచర్ల భీమరాజు, సత్యవాణి దంపతులు 20 రోజులుగా కోవాతో వివిధ రకాల స్వీట్లతో సారె తయారు చేయిస్తున్నారు. కల్యాణ మహోత్సవంలో శ్రీరాముని తరపున సీతమ్మ వారికి ఈ సారె (కంత) సమర్పించి తమ భక్తిని చాటుకుంటున్నారు. వివిధ రకాల ఫలాలు, పుష్పాలు, కూరగాయలు, పంచె, చీర, పర్ణశాల తదితర ఆకృతుల్లో కోవాతో తయారు చేస్తున్న ఈ స్వీట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కోవా స్వీట్లతో పాటు ఇతర పిండి వంటలను సిద్ధం చేస్తున్నారు. 'ఇంటికో పువ్వు.. ఈశ్వరునికో మాల' అన్నట్టుగా.. సారె తయారీలో స్థానిక మహిళా భక్తులు కూడా తమవంతు సేవలు అందిస్తున్నారు.

14 ఏళ్లుగా..



సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా కోవాతో వివిధ రకాల ఆకృతుల్లో స్వీట్లు, ఇతర పిండి వంటలు తయారు చేస్తున్నాం. మొత్తం 108 రకాలతో ఈ సారె సిద్ధం చేస్తున్నాం. 14 ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగిస్తున్నాం. ఏటా సీతారాముల సేవలో పాల్గొనే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నాం. – పేరిచర్ల సత్యవాణి, పి.గన్నవరం

రత్నగిరిపై నేటి నుంచి

శ్రీరామ నవమి వేడుకలు

అన్నవరం: రత్నగిరి క్షేత్ర పాలకుడు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి శ్రీరామ నవమి వేడుకలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా రత్నగిరి రామాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు రామాలయంలో సీతారాములను వధూవరులను చేసే కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు పెళ్లి పెద్దలుగా ఆలయం నుంచి ఊరేగింపుగా రామాలయానికి చేరుకుంటారు. అనంతరం సీతారాములను, సత్యదేవుడు, అమ్మవారిని రెండు వేర్వేరు సింహాసనాలపై వేంచేయించి, పండితులు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం శుభం కోరుతూ ముత్తయిదువులు పసుపు దంచుతారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొంటారు. శ్రీరామ నవమి సందర్భంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. రామాలయం పక్కనే ఉన్న భక్తుల విశ్రాంతి మండపంలో ఈ ఉత్సవం జరుగుతుంది. వచ్చే నెల 7వ తేదీ రాత్రి శ్రీపుష్పయాగంతో శ్రీరామనవమి వేడుకలు ముగుస్తాయి.

పోస్టల్ నిధుల గోల్‌మాల్‌పై సీబీఐ విచారణ

- సస్పెండైన ఇద్దరు ఉద్యోగులను ప్రశ్నించిన అధికారులు
- రూ.1.18 కోట్ల ఐపీపీబీ నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు ముమ్మరం
- అజ్ఞాతంలో ఉన్న సూత్రధారి కదలికలపై ఆరా

అమలాపురం టౌన్: అయినవిల్లి మండలం విలస సబ్ పోస్టాఫీస్ ద్వారా ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్(ఐపీపీబీ)లో జరిగిన రూ.1.18 కోట్ల గోల్‌మాల్‌పై సీబీఐ అధికారులు మంగళవారం విచారణ నిర్వహించారు. విశాఖపట్నం సీబీఐ కార్యాలయం నుంచి ఇద్దరు అధికారులు ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ ఈ విచారణ సాగించారు. తొలుత వారు పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీధర్‌తో భేటీ అయ్యారు. నిధుల దుర్వినియోగంపై నమోదైన కేసులోని నిందితుల సమగ్ర సమాచారం సేకరించారు. గత ఏడాది మే నెల మొదటి వారంలో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై శాఖాపరంగా జరిగిన ప్రాథమిక విచారణలో పర్యవేక్షణ లోపానికి బాధ్యులుగా గుర్తించి పోస్టల్ అసిస్టెంట్లు మంగతాయారు, మహాలక్ష్మిలను సస్పెండ్ చేశారు. ఎనిమిది మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ నిధుల గోల్‌మాల్‌కు సూత్రధారిగా అమలాపురం హెడ్ పోస్టాఫీసులో సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా పని చేసిన సతీష్‌ను గుర్తించారు. అయితే నిధుల దుర్వినియోగం వెలుగు చూడగానే అతడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. విచారణకు వచ్చిన సీబీఐ అధికారులు సస్పెండైన మంగతాయారు, మహాలక్ష్మిలను ఉదయం నుంచి రాత్రి వరకూ విచారించారు. ఈ కేసుకు సంబంధించిన ఐపీపీబీ రికార్డులను పరిశీలించారు. సమగ్ర సమాచారం సేకరించారు. సీబీఐ అధికారుల విచారణ బుధ, గురువారాల్లో కూడా కొనసాగుతుందని తెలిసింది. నిధుల దుర్వినియోగంలో షోకాజ్ నోటీసులు అందుకున్న ఎనిమిది మంది పోస్టల్ ఉద్యోగులను బుధవారం విచారించనున్నారని సమాచారం.

సూత్రధారిపై ఆరా

ఈ నిధుల దుర్వినియోగానికి సూత్రధారి అయిన సతీష్ పాత్రపై సీబీఐ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిధుల గోల్‌మాల్ బాగోతం వెలుగులోకి వచ్చినప్పటి నుంచీ అజ్ఞాతంలో ఉన్న సతీష్ కదలికలపై వారు ఆరా తీస్తున్నారు. రెండు నెలల కిందట హెడ్ పోస్టాఫీసులో జరిగిన శాఖా పరమైన విచారణకు సతీష్ తన తండ్రితో హాజరయ్యాడు. అప్పట్లో సస్పెండైన, షోకాజ్ నోటీసులు అందుకున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కార్యాలయానికి వచ్చి సతీష్‌ను నిలదీశారు. ఈ నేపథ్యంలో అతడు కార్యాలయం పై అంతస్తు ఎక్కి ఆత్మహత్యకు ఆడిన నాటకీయ పరిణామాలు, అతడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం వంటి పరిణామాలు తెలిసిందే. నేటికీ అజ్ఞాతంలో ఉన్న సతీష్‌ను కూడా సీబీఐ అధికారులు ఏదో ఒకలా రప్పించి బుధ, గురువారాల్లో విచారించే అవకాశాలున్నాయని పోస్టల్ సిబ్బంది చెబుతున్నారు.

క్రైం కార్నర్..

పరీక్షలకు వెళ్లి విద్యార్థిని అదృశ్యం



విద్యార్థిని తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ఒక ఇంటర్మీడియెట్ విద్యార్థిని పరీక్షలు రాయడానికని వెళ్లి అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆ విద్యార్థిని చేబ్రోలు ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. మంగళవారం ఉదయం ఇంటర్ పరీక్షలు రాయడానికని ఆటోలో పిఠాపురం వెళ్లింది. సాయంత్రం అవుతున్నా ఆమె తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వినయ్‌ప్రతాప్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని, విచారణ ప్రారంభించారు. విద్యార్థిని పరీక్షలు రాయడానికి వెళ్లిన ఆటో డ్రైవర్‌ను విచారించగా.. పరీక్షలకు తీసుకువెళ్లి, తరువాత ఇంటికి తీసుకువచ్చి దింపేశానని చెప్పాడు. ఆమె ఆచూకీ కోసం పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తన సిబ్బందితో ప్రయత్నం ఆరంభించారు. ఆమె స్నేహితులను విచారిస్తున్నారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు: పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక సమీపాన గోదావరి నదిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడిని ఎన్‌టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలటూరు గ్రామానికి చెందిన చింతపల్లి రవికుమార్(34)గా గుర్తించారు. ఇతడు ఫారమ్స్ సిగరెట్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. తరచూ రాజమహేంద్రవరంలో నిర్వహించే కంపెనీ సమావేశాలకు వస్తుంటారు. ఈ నెల 26వ తేదీన ఇంటి నుంచి వచ్చిన రవికుమార్ అదే రోజు భార్యకు ఫోన్‌ చేసి తాను బయటకు వచ్చానని, ఇంటికి వస్తాను కంగారు పడవద్దని ఫోన్ చేశాడు. అనంతరం అతడి ఫోన్ స్విచాఫ్ అయ్యింది. అతడి కోసం గాలిస్తుండగా గోదావరి నదిలో మృతదేహం కనిపించిందని బావమరిది పత్తాల కుమారబాబు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

డిగ్రీ కళాశాల లైబ్రరీకి రూ.19.87 లక్షల విరాళం



ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న చైతన్యబాబు, ఆర్యన్

మండపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రరీ హాలు నిర్మాణానికి స్థానిక మాధవి ఎడిబుల్ ఆయిల్స్ సంస్థ యాజమాన్యం ముందుకొచ్చింది. వేగుళ్ల సూర్యారావు చారిటబుల్ ట్రస్టు ద్వారా మాధవి ఎడిబుల్ ఆయిల్స్ అధినేత వీవీఎస్ చౌదరి (మాధవిబాబు), సంస్థ ఈడీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నేత కృష్ణచైతన్య పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. డిగ్రీ కళాశాల లైబ్రరీ హాలు నిర్మాణానికి అధికారులు రూ.19.87 లక్షలతో అంచనాలు రూపొందించారు. ఈ మేరకు చెక్కును ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావుకు బైపాస్ రోడ్డులోని మాధవి ఎడిబుల్ ఆయిల్స్ ఫ్యాక్టరీ కార్యాలయంలో డైరెక్టర్ వేగుళ్ల చైతన్య బాబు, వేగుళ్ల ఆర్యన్ మంగళవారం అందజేశారు. లైబ్రరీ హాలు నిర్మాణం అనంతరం అందులో పుస్తకాల కోసం మరో రూ.2 లక్షలు అందజేస్తామని ప్రకటించారు. సంస్థ యాజమాన్యానికి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వంక ప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.